నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శనివారం | నవంబర్ 23, 2024 | www.navatelangana.com

రెండు తలల దూడ జననం

- వింతగా తిలకించిన స్థానికులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



ఎల్లారెడ్డి పురపాలక సంఘం పరిధిలోని గండి మాసానిపేట్‌లో శుక్రవారం పుట్ల శ్రీనివాస్ అనే రైతుకు చెందిన గేదెకు రెండు తలల దూడ జన్మించింది. దీంతో ఆందోళన చెందిన రైతు ఎల్లారెడ్డి పశు వైద్యులకు సమాచారం ఇచ్చినప్పటికీ వారు దూడను పరిశీలించడానికి రాలేదని రైతు అసహనం వ్యక్తం చేశాడు. రెండు తలల దూడ జన్మించిందని తెలుసుకున్న స్థానికులు అధిక సంఖ్యలో రైతు ఇంటికి వచ్చి వింతగా తిలకించారు. కొన్ని గంటల తర్వాత సాయంత్రానికి దూడ మరణించినట్లు రైతు తెలిపారు.

బడి పిల్లల కథల సింగిడి పుస్తకావిష్కరణ

నవతెలంగాణ-రామారెడ్డి



మండలంలోని గిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడి పిల్లల కథల సింగిడి పుస్తకాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి రాజు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు సాహిత్య అకాడమీ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో నలుపు, తెలుపు కథకు గిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రథమ బహుమతి రావడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో స్థానిక మండల విద్యాధికారి ఆనందరావు, ఎస్ఎస్ నగర్ ఎంఈఓ యూసుఫ్, తెలుగు సాహిత్య కవులు విఆర్ శర్మ, సుంకటి నరేష్, మాజీ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ప్రవీణ్ గౌడ్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆనంద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాణిక్య రెడ్డి, ఉపాధ్యాయ బృందం, వీడీసీ కమిటీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



తాడ్వాయి: వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

తూకం చేసిన ధాన్యాన్ని
రైస్‌మిల్లులకు తరలించాలి

- అదనపు కలెక్టర్ విక్టర్

నవతెలంగాణ-తాడ్వాయి

తూకం చేసిన వరి ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. తూకంలో వ్యత్యాసం లేకుండా చూడాలని, కేంద్రంలో రైతులకు అవసరమైన సహకారం అందించాలని సిబ్బందికి సూచించారు. కేంద్రంలో అదనంగా ఉన్న గన్నీ బస్తాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ నల్లవెల్లి కపిల్‌రెడ్డి, డిసిఓ రామ్మోహన్, సీఈఓ నర్సింలు, బాలకిషన్, రమేష్ సిబ్బంది రైతులు తదితరులున్నారు.

రుచికరమైన భోజనం అందించాలి..

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంట చేసేముందు వంట పాత్రలను, చేతులను శుభ్రంగా కడుక్కొని వంట చేయాలని సూచించారు. రోజుకో రకమైన వంటలు చేయాలని, వడ్డించే ముందు ఉపాధ్యాయులు రుచి చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి, రాజాగౌడ్, సంగారెడ్డి శ్రీనివాస్ తదితరులున్నారు.

పెట్రోల్ బంక్ స్థల పరిశీలన..

పిట్లం : మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంక్ స్థల పరిశీలన నిమిత్తం జిల్లా అడిషనల్ కలెక్టర్ విక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పెట్రోల్ బాంక్ నిర్మాణంతో పాటు పరిసర ప్రాంతం అనుకూలంగా ఉన్నది లేనిది పరిశీలించారు. స్థల పరిశీలనతో పాటు బంక్ ఫైల్స్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ధరణి కొనసాగుతున్న తీరును తహసిల్దార్ వేణుగోపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. కాగా సిబ్బంది హాజరు రిజిస్టర్‌తో పాటు పలు రికార్డులను, రికార్డు గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ శీతల్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రమసంఖ్య ప్రకారమే తూకం వేయాలి..

లింగంపేట్ : కొనుగోలు కేంద్రాల వద్ద క్రమ సంఖ్య ప్రకారమే తూకం వేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో గల కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు కొనుగోలు కేంద్రంలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా.. వాటిని వెంటనే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. వరుస క్రమంలో తూకం వేయాలని, తూకంలో జాప్యం లేకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట తహసిల్దార్ నరేందర్, సొసైటీ సీఈవో పెంటయ్య తదితరులున్నారు.

క్లినిక్‌లలో వైద్యాధికారుల తనిఖీలు

- కేసులు నమోదు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని మంచిప్ప గ్రామంలో ప్రైవేటు మెడికల్ ప్రాక్టీస్ నిర్వహిస్తున్న రెండు క్లినిక్‌లపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ కె.మహేష్, మెంబర్స్ డాక్టర్ సన్నీ, డాక్టర్ శిరీష్‌తో కలిసి శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. అనంతరం కేసులు నమోదు చేశారు. కేసు నమోదు చేసే సమయంలో అక్కడున్న గ్రామస్తులు, చుట్టుపక్కల తండా ప్రజలు 'మావి మారుమూల తండాలు. మాకు జ్వరం వస్తే వీళ్లవద్దనే చూయించుకుని నయం చేసుకుంటున్నాం. వీరు కూడా లేకపోతే మా పరిస్థితి ఘోరంగా ఉంటుంది. మమ్మల్ని పట్టించుకునే నాథుడే ఉండడు.' అని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చైర్మన్, మెంబర్స్ ముందు వారు వాపోయారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ.. 'మంచిప్ప గ్రామం, పరిసర ప్రాంతాల ప్రజల నుంచి తమకు మెయిల్ రావడం వల్లనే ఇక్కడికి వచ్చాం, ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషన్‌ల వైద్యం చట్టరీత్యా నేరం. ప్రభుత్వం ఎటువంటి విధంగా కూడా వీరిని ప్రోత్సహించదు. కేవలం వైద్య విద్య చదివిన వారు మాత్రమే హాస్పిటల్ నిర్వహించాలి. పీఎంపీలు జ్వరం వస్తే ఇంజక్షన్స్‌కు వెంటనే మీ జ్వరం తగ్గిపోతుంది. కానీ వారిచ్చే ఇంజక్షన్‌లో హెవీడోస్ ఉంటుంది. దానివల్ల రానురానూ రోగనిరోధక శక్తి తగ్గి కిడ్నీలపైన ఎక్కువ ప్రభావం చూయిస్తుంది.



రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

దానివల్ల డయాలసిస్ వరకు వెళ్లాల్సి వస్తుంది. ఇప్పుడున్న కాలంలో 25-30 సంవత్సరాలు ఉన్న యువకులే కిడ్నీ సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నారు. ఇప్పటికైనా గ్రామీణ ప్రాంత ప్రజలందరూ గమనించాలి. ఇటువంటి వారిని నమ్మి మీ ప్రాణాల మీదికు తెచ్చుకోవద్దు. వైద్య విద్య చదివి ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్ పొందిన వారి దగ్గరికి మాత్రమే వెళ్లాలి. ప్రైవేట్ ప్రాక్టీషనర్లు క్లినిక్‌లను నిర్వహిస్తే తమను సంప్రదించాలి.' అని వైద్యులు గ్రామస్తులకు సూచించారు.

త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేపట్టాలి

- కొనుగోలు వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలి
- జిల్లా సహకార సంఘాల అధికారి శ్రీనివాస్

నవతెలంగాణ-బోధన్

రైతుల ధాన్యం త్వరితగతిన కొనుగోలు చేసి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా సహకార సంఘాల అధికారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన బోధన్ మండలం కల్దుర్కి, సాలూర మండల కేంద్రంలోని సొసైటీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం సీఈఓలతో ధాన్యం



జిల్లా సహకార సంఘాల అధికారిని సన్మానిస్తున్న పలువురు

కొనుగోలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాలూర సొసైటీలో రికార్డులను పరిశీలించారు. రైతుల సౌకర్యార్థం ఎప్పటికప్పుడు ధాన్యం వివరాలను ట్యాబ్ ద్వారా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఇప్పటికే 60 శాతం మంది రైతులకు ధాన్యం డబ్బులు చెల్లించామని తెలిపారు. ప్రభుత్వం ద్వారా రైతులకు బోనస్ సైతం వేసినట్టు వివరించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ సందర్భంగా సాలూర సొసైటీ చైర్మన్ అల్లే జనార్ధన్, డైరెక్టర్లు, కార్యదర్శి బస్వంత్‌రావులు డీసీవోను శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

తుప్పు పట్టిన బస్సులో
విద్యార్థుల ప్రయాణం

నవతెలంగాణ-భిక్కనూర్



భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో తుప్పు పట్టిన బస్సులో విద్యార్థులను ఇంటి నుంచి పాఠశాలకు, పాఠశాల నుంచి ఇంటికి తీసుకెళు న్నారు. రవాణా శాఖ అధికారులు విద్యా సంస్థ ప్రారంభ సమయంలో కాలం చెల్లిన బస్సులలో విద్యార్థులను తరలించవద్దని, అన్ని విధాలుగా కండిషన్ ఉన్న బస్సులలో విద్యార్థులను తరలించాలని, అర్హత ఉన్న డ్రైవర్‌ను నియమించుకోవాలని తగు సూచనలు చేస్తున్న విషయం తెలిసిందే. కానీ విద్యా సంస్థల యాజమాన్యాలు మాత్రం అవేవీ పట్టించుకోవడం లేదు. కాలం చెల్లిన, శిథిలావస్థకు చేరిన, తుప్పు పట్టిన బస్సులలో విద్యార్థులను తరలిస్తున్నారు. ఓ ప్రైవేట్ పాఠశాలలో ఇటు వాహనం సక్రమంగా లేకపోవడం, అటు అర్హత లేని ఉపాధ్యాయులు, సౌకర్యాలు లేని పాఠశాల గదులు, విద్యార్థులకు సరిపడా టాయిలెట్లు సక్రమంగా లేని కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మధ్యకాలంలో అర్హత లేని డ్రైవర్లను నియమించి, కాలం చెల్లిన బస్సులు ఏర్పాటుచేసి పాఠశాల బస్సులు ప్రమాదం జరుగుతున్న విషయం తెలిసిందే. విద్యాశాఖ నియమ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్ పాఠశాలపై అధికారులు తనిఖీలు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా పాఠశాలపై ఇటు రవాణా శాఖ అధికారులు అటు విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాల్సి ఉంది.

బోధన్ డివిజన్‌లో 93.12 శాతం
సమగ్ర కుటుంబ సర్వే పూర్తి

- సబ్ కలెక్టర్ వికాస్ మహతో

నవతెలంగాణ-బోధన్



బోధన్ డివిజన్‌లో 93.12 శాతం సమగ్ర కుటుంబ సర్వే పూర్తయిందని సబ్ కలెక్టర్ వికాస్ మహతో తెలిపారు. శుక్రవారం బోధన్ డిగ్రీ కళాశాలలో డాటా ఎంట్రీని పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగతా సర్వేను సైతం త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. సర్వే కోసం ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్‌లకు ప్రజలు సహకరించి త్వరగా పూర్తయ్యేలా వివరాలు చెప్పాలన్నారు. బోధన్ మండలంలో 91.34, మిగతా మండలాలలో 92 శాతం చొప్పున సర్వే పూర్తయిందన్నారు. బోధన్ పట్టణంలో 88.5 శాతం చేశారని తెలిపారు. బోధన్ డివిజన్‌లో గురువారం నుంచి డాటా ఎంట్రీ ప్రారంభించామని సబ్ కలెక్టర్ తెలిపారు. బోధన్ పట్టణంలోని డిగ్రీ కళాశాలలో, మండల కార్యాలయంలో డాటా ఎంట్రీ నిమిత్తం 40 కంప్యూటర్‌లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మండల కేంద్రాలలో సైతం కంప్యూటర్‌లను ఏర్పాటు చేశామన్నారు. డాటా ఎంట్రీ ఆపరేటర్‌లకు ఇప్పటికే శిక్షణా ఇచ్చి సిద్ధం చేశామని వివరించారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా డాటా ఎంట్రీని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ నెల 28వ తేదీలోపు డాటా ఎంట్రీతో సహా సర్వేను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు.

ఆ నలుగురు మాకు వద్దు

- కేజీబీవీ వసతి గృహంలో విద్యార్థినిల నిరసన



వసతిగృహం వద్ద నిరసన చేస్తున్న విద్యార్థినిలు

నవతెలంగాణ-దోమకొండ

మండలంలోని సీతారాంపల్లి గ్రామంలోని కేజీబీవీ పాఠశాల వసతి గృహంలో విద్యార్థులు శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు మాట్లాడుతూ.. దోమకొండ కేజీబీవీ పాఠశాలకు బీబీపేట్ మండలం నుంచి వచ్చిన ప్రిన్సిపాల్ మంగమ్మతో పాటు మరో ముగ్గురు సిబ్బందిని దోమకొండ కేజీబీవీ నుంచి పంపించాలని పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. బీబీపేట కేజీబీవీలో గత కొన్ని రోజుల క్రితం విద్యార్థినిలను అనేక ఇబ్బందులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతనంగా వచ్చిన సిబ్బందిని పంపించే వరకు ఆహారం తీసుకోబోమని నిరసన వ్యక్తం చేశారు. వెంటనే వసతి గృహంలోని విద్యార్థినీలను ఎంఈఓ విజయకుమార్ సముదాయించి, డీఈవో ఇతర జిల్లా అధికారులతో మాట్లాడి కొత్తగా బీబీపేట్ నుంచి వచ్చిన ఎస్ఓ ముగ్గురు సిబ్బందిని వచ్చిన వారిని పంపిస్తానని హామీనిచ్చారు. దీంతో విద్యార్థులు నిరసనను విరమించారు.

బోర్గంలో ఒకరికి డెంగ్యూ

- అప్రమత్తమైన వైద్య సిబ్బంది

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గం గ్రామంలో ఒకరికి డెంగ్యూ పాజిటివ్ రావడంతో వైద్య సిబ్బంది ఆ గ్రామాన్ని సందర్శించి పరిసరాలను పరిశీలించారు. గ్రామంలోని ఇంటింటి సర్వే నిర్వహిస్తూ జ్వర పీడిత ప్రజలను గుర్తించి వారి నుంచి రక్త నమూనలను సేకరించారు. దోమల నివారణ మందులను పిచికారీ చేయడం, దోమల నివారణపై అవగాహన కల్పించినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి వంట గదులు వంట సామగ్రిని జాగ్రత్త పరచాలని సూచించారు. కీటక జనిత దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం ఫ్రైడే ఫ్రైడే నిర్వహించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తీర్ణ అధికారి కరిపే రవీందర్, ఆరోగ్య కార్యకర్తలు మంజుల, రాధిక, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత, ఉపాధ్యాయులు భారతి, సుజాత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సౌత్ క్యాంపస్‌లో
ఆర్ఎస్ఎస్ ప్రచారక్ పాల్గొనడం సరికాదు

- విద్యార్థి సంఘాల నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో నిర్వహించిన ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా సభలో ఆర్ఎస్ఎస్ ప్రచారక్ పాల్గొనడాన్ని ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యుఐ, బివిఎం విద్యార్థి సంఘాల నాయకులు వ్యతిరేకించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు శుక్రవారం మాట్లాడుతూ.. చాలామంది విద్యార్థులు, అధ్యాపకులు విద్యారంగాన్ని కాషాయీకరణ చేస్తున్నారని తెలిపారు. యూనివర్సిటీ వెలుపలి నుంచి కొంతమంది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరైనట్లు తెలిసిందని, ఈ ఘటనను ఖండించదగిన విషయమన్నారు. ఇది ఒక విశ్వవిద్యాలయమని, అధికారులు విద్యా కార్యకలాపాలకు మాత్రమే అనుమతించాలి కానీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లలిత అధ్యక్షతన ఆర్ఎస్ఎస్ ఇందూరు విభాగ ప్రచారక్ నర్రా వెంకట శివ కుమార్, జి.వాల్లకాటి సాయినాథ్‌ను ముఖ్య అతిథులుగా ఆహ్వానించి ప్రసంగాలు చేయించి విద్యార్థుల్లో అలజడి రేపి అల్లర్లు జరిగే అవకాశం కల్పించారన్నారు. ఇకనుంచి విశ్వవిద్యాలయాల్లో ఇలాంటి సభలు జరగకుండా అడ్డుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర కార్యదర్శి వియం విఠల్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు ఐరేని సందీప్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముదాం అరుణ్ కుమార్, బివిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్, పెరుమాండ్ల బుల్లెట్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే నమోదును వేగంగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-తాడ్వాయి

కుటుంబ సర్వే నమోదును కంప్యూటర్లో వేగవంతంగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో కంప్యూటర్ నమోదును పరిశీలించారు. చిన్నపాటి పొరపాట్లు లేకుండా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. ఎలాంటి తప్పులు దొర్లినా కుటుంబాల సభ్యులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్, తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీఓ సవితరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హారిక, సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు ఉన్నారు.



దాటాను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సేవా కేంద్రం ప్రారంభం



సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని మిస్టర్ చాయ్ టీ పాయింట్‌లో శుక్రవారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ దండబోయిన సంజీవ్ మాట్లాడుతూ.. ఆధార్ కార్డుతో డబ్బులు తీసుకునే సౌకర్యం ఏర్పాటు చేయబడిందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన ప్రియ శైలేష్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ప్రభుత్వ సలహాదారులు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ రావ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు పండ్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోనె శ్రీనివాస్, కౌన్సిలర్ అన్వర్ అహిమద్, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అధ్యక్షులు పంపరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
శనివారం | నవంబర్ 23, 2024 | www.navatelangana.com

మల్లారెడ్డి చెరువులో క్లీన్ అండ్ గ్రీన్

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ ఆధ్వర్యంలో పట్టణంలోని మల్లారెడ్డి చెరువు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టామని మున్సిపల్ చైర్ పర్సన్ వన్నెల్ దేవి లావణ్య అయ్యప్ప శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువు వ్యర్థ పదార్థాలతో కంపు కొడుతుందని, ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని, చెరువు నీటిని మంచినీటిగా మార్చాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మున్నా, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


చెరువును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్

అత్యుత్తమ సేవకు దేశరత్నతో సత్కారం

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రానికి చెందిన అలుక కిషన్ తన అత్యుత్తమ సేవకు సామాజిక గుర్తింపుగా ప్రతిష్టాత్మక దేశరత్న అవార్డుతో సత్కరించారు. 21న ఢిల్లీలో జరిగిన వేడుకలో అవార్డును అందించారని అలుక కిషన్ శుక్రవారం తెలిపారు. భారతదేశం యొక్క సామాజిక సవాళ్లను పరిష్కరించడంలో సమిష్టి చర్య ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, తన గురువులు, సహచరులు తాను పనిచేసిన సంఘాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు ప్రదానోత్సవానికి ప్రముఖ మంత్రులు, బాలీవుడ్ తారలు, సామాజిక కార్యకర్తలు, పారిశ్రామికవేత్తలు మేధావులు, హాజరయ్యారని అన్నారు.


అవార్డు అందుకుంటున్న అలుక కిషన్

విద్యార్థులకు టై, బెల్టులు, గుర్తింపు కార్డులు అందజేత


విద్యార్థులకు టై, బెల్టులు అందజేస్తున్న శివకుమార్

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని శివతాండ ప్రాథమిక పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకుమార్ తన సొంత డబ్బులతో విద్యార్థులకు టై, బెల్టు గుర్తింపు కార్డులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో వెంకటరమణ మాట్లాడుతూ గిరిజన పాఠశాలలో 64 మంది విద్యార్థులకు సుమారు పదివేల రూపాయలు ఖర్చు చేసి టై, బెల్టు గుర్తింపు కార్డులను అందజేసి ఉత్తమ విద్యను అందజేసేందుకు కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు శివకుమార్ ను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగనాథ్, ఎంఈఓ అశోక్, ఎంపీఓ రామకృష్ణ, పిఆర్‌టియు నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామూహిక వివాహాలు నిర్వహించడం సంతోషం

- మాజీ నగర మేయర్ ధర్మపురి సంజయ్


మాట్లాడుతున్న మాజీ నగర మేయర్ ధర్మపురి సంజయ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ మాజీ నగర మేయర్ ధర్మపురి సంజయ్ 53వ జన్మదిన వేడుకల సందర్భంగా రెండు గంటలకు సామూహిక పెళ్లిలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామూహిక వివాహాలను జరపడం ఆనవాయితీగా వస్తుందన్నారు. 2005తో ప్రారంభమైన సామూహిక వివాహాలు 2024 వరకు సుమారు 130కి పైగా పెళ్లిళ్ల చేసినట్టు తెలిపారు. ఈ ప్రక్రియ ఇక ముందు కూడా కొనసాగుతుందని తెలిపారు. పెళ్లివారి బంధువులు ధర్మపురి సంజయ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జగదీష్ కులకర్ణి, సాయిలు, ఆకుల చిన్న రాజేశ్వర్, ఫైనాన్సు రాము, వెంకట్, సాగర్, అనిల్, పెళ్లి పెద్దలు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై అధికారులకు వినతి


వినతిపత్రం అందజేస్తున్న గ్రామ అభివృద్ధి కమిటీ

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని నడిమి గల్లీ నుంచి చెరువుకు వెళ్లే మార్గంలో ఇటీవల వర్షాకాలంలో పురాతన కమాను కూలిపోయింది. ఆ శిథిలాలలు ఇప్పటికీ మార్గమధ్యలో ఉండడంతో చెరువు కింద ఉన్న పొలాలకు వెళ్లే రైతులకు ఇబ్బందిగా మారిందని వెంటనే శిథిలాలను తొలగించాలని కోరారు. చెరువు కట్ట పైనుంచి ఇత్వార్ పెట్ వెళ్లే రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయని వాటిని పూడ్చాలని అన్నారు. అలాగే చెరువుకి ఇరువైపులా చెట్లు, తుమ్మ చెట్లు, ముళ్ళపొదలు ఎక్కువగా పెరిగాయని, వాటిని తొలగించాలని అధికారులను వారు కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సల్ల నర్సయ్య, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుండ్రతి నడిపి పోశెట్టి, గ్రామ పెద్దలు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

1న అథ్లెటిక్స్ పోటీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 1న ఉదయం 7 గంటలకు స్థానిక పాలిటెక్నిక్ క్రీడా మైదానంలో 30 సంవత్సరాలు పై బడిన 80 ఏండ్లు పైబడిన వారి విభాగంలో పురుషులు, మహిళా క్రీడాకారులకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్టు మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ శీను నాయక్, జనరల్ సెక్రటరీ బద్దం గోపిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అథ్లెటిక్స్ పోటీల్లో 100 మీటర్లు, 200 మీటర్లు, షాట్ పుట్, డిస్క్ త్రో, లాంగ్ జంప్, 5 కిలోమీటర్ల విభాగంలో నడక, రన్నింగ్ ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ పోటీలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఎంపిక అయిన క్రీడాకారులను త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్టు తెలిపారు. ఈ సారి ఓవరాల్ చాంపియన్ మెన్, ఉమెన్‌కి ప్రైజ్ మనీ ఉందని సూచించారు. కావున ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 200 ఫీజులు చెల్లించి ఆర్గనైజింగ్ సెక్రటరీ కిరణ్ కుమార్ 9440007576, ప్రధాన కార్యదర్శి బద్దం గోపిరెడ్డి 9949585065, కోశాధికారి నీతారెడ్డి 9603876541 సంప్రదించాలని తెలిపారు. ఈసారి నేషనల్స్ తేది 31-01-2025 నుంచి 03-02-2025 వరకు కేరళలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

వామ్మో చలి..



- పెరుగుతున్న చలి తీవ్రత
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్‌లో రోజు రోజుకు చలి పంజా విసురుతోంది. వేకువజాము మొదలు దట్టమైన పొగమంచు కమ్ముతోంది. స్వెటర్లు వేసుకున్నా వణకాల్సిందే. జిల్లాలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15.6 డిగ్రీలకు చేరింది. గత పది రోజుల్లో వాతావరణంలో మార్పులు రావడంతో చలి రోజురోజుకు పెరుగుతూ వస్తుంది. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం చలి ఎక్కువగా ఉందని ప్రజలు భావిస్తున్నారు.

ఈ నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు, కూలీలు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయాన్నే వాకింగ్, జాగింగ్ చేసే వారు ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకోకుంటే జబ్బుల బారిన పడాల్సి వస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆస్తమా జబ్బు ఉన్న వారు శీతాకాలంలో వాకింగ్‌కు వెళ్లకపోవడమే మంచిదని సూచిస్తున్నారు. చలితీవ్రత పెరిగే కొద్ది శ్వాస కోస వ్యాధులు ప్రబలే ప్రమాదముందని, ఉదయాన్నే బయటకు వెళ్లకపోవడమే ఉత్తమమని, వైద్యులు పేర్కొన్నారు. తాగునీటి విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగడం శ్రేయస్కరమని, వేడి వేడి ఆహార పదార్థాలనే తీసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.

ఉన్ని దుస్తులు ధరించాలి..

చలి పెరగడంతో గుండె సంబంధిత వ్యాధులతో బాధ పడేవారు, జ్వరం, దగ్గు సమస్యలున్నవారు వెచ్చని వాతావరణంలో ఉండేలా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వృద్ధులు, చిన్నారులతోపాటు అన్ని వయసుల వారు స్వెటర్లు, జర్కిన్, మంకీ టోపీలు ధరించడం మేలు. శీతలపానీయాలకు, ఐస్‌క్రీంలకు దూరంగా ఉంటూ బయటికి వెళ్లినపుడు చెవుల్లోకి దూది పెట్టుకుని వెళ్లడం మంచిదని చెబుతున్నారు.

పరిశుభ్రత పాటిస్తే జ్వరాలు దూరం లేకుంటే ఆరోగ్య సమస్యలు తప్పవు

డాక్టర్ జక్క రవి (ఎంబిబిఎస్ ఎండి ఫిజీషియన్)

చలి కాలంలో ప్రతి ఒక్కరూ విధిగా తగు జాగ్రత్తలు పాటించాలి. శీతాకాలంలో ముఖ్యంగా జలుబు, జ్వరం, ఫ్లూ వంటివి వ్యాపించే ప్రమాదముంది. జాగ్రత్తలు పాటించకుంటే ఆరోగ్య సమస్యలు తప్పవు. అందువల్ల ప్రతి ఒక్కరు శీతాకాలం ముగిసే వరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వాతావరణంలో మార్పుల వల్ల విష జ్వరాలు పెరుగుతున్నాయి. ఉదయం నుండి రాత్రి వరకు మోకాలు భాగం వరకు దోమలు కుడతాయని అందుకు అనుగుణంగా జాగ్రత్తలు పాటించాలి. ఇంటిని రోజు శుభ్రం చేసుకోవాలి. ఆకుకూరలు, పౌష్టికాహారం ప్రతి ఒక్కరూ తీసుకోవాలి. ప్రతి ఒక్కరూ లో ఇమ్యూనిటీ పవర్ ఉన్నట్లయితే వ్యాధులను కొంతవరకు ఇంటి వద్ద ఉండి తగ్గించుకోవచ్చు.

ఆకట్టుకునేలా విద్యాబోధన చేయాలి

- డీఈవో అశోక్
- పాఠశాల సందర్శన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను విద్యాధికారి అశోక్ శుక్రవారం సందర్శించారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను చదివించడం, ఎఫ్ఎల్ఎన్ ప్రకారం విద్య బోధన విధానాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, నిర్వాహకులకు సూచనలు చేశారు. ఉన్నత పాఠశాలలో 8,10 తరగతి గదులను సందర్శించారు. ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థులు 10 జీపీఏ సాధించి ట్రిబుల్ ఐటీ సీట్లు సాధించి అందరికి పేరు తేవాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. ఉపాధ్యాయులు డైరీ రాయాలని, టిఎల్ఎం ఉపయోగించి ఆకట్టుకునేలా విద్య బోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆంధ్రయ్య, ప్రధానోపాధ్యాయులు కే.రాజన్న, పీజీ హెచ్ఎం గిరిధర్, పాధ్యాయులు పాల్గొన్నారు.


డీఈవోను సన్మానిస్తున్న ఉప్లూర్ పాఠశాల సిబ్బంది

కస్తూర్బా విద్యాలం పరిశీలన..

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. విద్యాలయ ంలో తరగతి గదులను, వంటశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యాలయం ప్రత్యేక అధికారిని గంగామణికి పలు సూచనలు చేశారు.

ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

నవతెలంగాణ-ఆర్మూర్

మన తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ హాస్పిటల్‌ను బలోపేతం చేసి, ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటల్స్ ఫీజుల దోపిడీని అరికట్టాలంటూ ప్రోగ్రెసివ్ యూత్‌లీగ్, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో ప్రభుత్వ హాస్పిటల్స్‌ను బలోపేతంచేసి, ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటల్ ఫీజుల దోపిడీని అరికట్టాలంటూ రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు వి.సత్తెమ్మ, పివైఎల్ జిల్లా అధ్యక్షులు అనిస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు, నర్సులు సరిపడా లేకపోవడంతో పేద ప్రజలకు సరియైన వైద్య సేవలను అందించడం లేదని అన్నారు. పేషెంట్లకు వైద్య పరీక్షల సౌకర్యంలేక బయటకువెళ్లి ప్రైవేట్ ల్యాబుల్లో టెస్టులకు విపరీతమైన ఫీజులు చెల్లించుకోలేక సరియైన వైద్యాన్ని పొందలేక పోతున్నారని వారన్నారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకులు జి.పద్మ, ఎస్.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు బట్టు రవి, మనోజ్, గంగాధర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ పర్యటన


మురికి కాలువను పరిశీలిస్తున్న మున్సిపల్ డిప్యూటీ కమిషనర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని 50వ డివిజన్ శివాజీ నగర్‌లో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర కుమార్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డ్రైనేజీ సరిగ్గా లేదని, మురికి నీరు ఇళ్ల ముందు చేరుతున్నట్టు స్థానికులు తెలిపారు. కొత్త పైప్‌లైన్, సీసీ డ్రైనేజీ నిర్మించాలని కార్పొరేటర్ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు మహిపాల్, మున్సిపల్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

మాలల సింహ గర్జన పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

డిసెంబర్ 1 న జరిగే ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో మాలల సింహ గర్జన వాల్ పోస్టర్స్‌ను నగరంలోని స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. రాష్ట్ర కో-కన్వీనర్ ఎడ్ల నాగరాజు, అంగరి ప్రదీప్ జేఏసీ చైర్మన్ ఆనంపల్లి ఎల్లయ్య, కో చైర్మన్ దేవదాసు, ఉదయ్ కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షులు నీలగిరి రాజు, అశోక్ భాగ్యవాన్, నగర కమిటీ చైర్మన దయా సాగర్, విజయ్ సోలంకి, కిష్టన్న పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెద్ద ఎత్తున మాలలందరూ తరలివచ్చి సింహ గర్జన విజయవంతం చేయాలని కోరారు.

పలు కుటుంబాలను పరామర్శించిన ముత్యాల సునీల్ రెడ్డి


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ముత్యాల సునీల్‌రెడ్డి

నవతెలంగాణ-ఏర్గట్ల

బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి మండల కేంద్రంలో బాధిత కుటుంబాలను శుక్రవారం పరామర్శించారు. బద్దం లింగారెడ్డి వాళ్ళ అమ్మ గంగవ్వ ఇటీవలే మరణించగా వారి కుటుంబాన్ని, రొక్కెడ చిన్న సాయన్న సోదరుడు రొక్కెడ నడిపి ఆశన్న కుటుంబాన్ని, దొబ్బల చిన్న కిషన్ తండ్రి కాలు విరగడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

మైనర్లు వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తాం

- సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి.నారాయణ


మాట్లాడుతున్న సబ్ ఇన్‌స్పెక్టర్

నవతెలంగాణ-మెండోర

మైనర్లకు వాహనాలు ఇచ్చి ఇబ్బందులకు గురికావొద్దని ఎస్ఐ జి.నారాయణ తెలిపారు.

శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వాహనాలు నడిపేవారు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడిపితే మైనర్లపై, వాహనదారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనాలు నడిపేవారు మద్యం సేవించి నడపకూడదని, మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. గ్రామాల్లో నివాస గహాల వద్ద సిసి కెమెరాలు నిర్మించుకోవాలని సూచించారు. ఒక సిసి కెమెరా 100 మంది పోలీసులతో సమానం కాబట్టి నూతనంగా ఇండ్లు నిర్మించుకునేవారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఇండ్లకు తాళం వేసి ఇతర గ్రామాలకు వెళ్ళేవారు పోలీసులకు ముందస్తు సమాచారం అందించాలని కోరారు. దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గంజాయి, పేకాటాడితే ఎస్ఐ నంబరు 8712659864కు, సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని అన్నారు.

ఉషా క్రీడా జిల్లా అధ్యక్షులుగా ఏలేటి గంగాధర్


ఏలేటి గంగాధర్‌ను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-ముప్కాల్

ఉషా క్రీడా జిల్లా నూతన అధ్యక్షులుగా ఎన్నికైన ఏలేటి గంగాధర్‌ను 'ముప్కాల్ గ్రామపరిరక్షణ సమితి' ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపరిరక్షణ సమితి' అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు ఏలేటి గంగాధర్ మాట్లాడుతూ.. ఉషా క్రీడను జిల్లా వ్యాప్తంగా విస్తరిస్తూ క్రీడాకారులకు మంచి భవిష్యత్తును అందిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామపరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి గైని సంజీవ్ థామస్, సలహాదారులు టి.సాయన్న, గద్దల గంగారాం, సహాయ కార్యదర్శి కట్ట మహేష్, కోశాధికారి కంచు విజయ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జక్కుల రాము, ఉపాధ్యక్షులు చిన్న బాల్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

సేవాకార్యక్రమాల్లో ముందుండాలి



నవతెలంగాణ-ఆర్మూర్

ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యక్రమాలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తివంతం అని

క్షత్రియ విద్యాసంస్థల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్ అన్నారు. ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం క్షత్రియ కళాశాలలో సేవా కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవా కార్యక్రమాల్లో ముందుండాలని అన్నారు. ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు మద్దుకూరి సాయిబాబు తమ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను వీడియో ప్రజెంటేషన్ ద్వారా చూపిస్తూ అవగాహన కల్పించారు. మానవత్వంతో ప్రతి ఒక్కరు సేవా కార్యక్రమాల్లో ముందుండాలని తెలిపారు. కార్యక్రమంలో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, క్షత్రీయ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా శ్రీకాల భైరవస్వామి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-రామారెడ్డి
మండలంలోని ఇస్సన్నపల్లి (రామారెడ్డి)లో వెలసిన శ్రీ కాలభైరవ స్వామి జన్మదిన వేడుకల్లో భాగంగా మూడవరోజు శుక్రవారం లక్షదీపార్చన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించటంతో, ఆలయ ప్రాంగణం దీపాల కాంతులతో, సందర్శకులను కనులవిందు చేసింది. కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి ప్రభు, పూజారులు శ్రీనివాస్ శర్మ, వంశీకష్ణ శర్మ, ఆలయ సిబ్బంది లక్ష్మణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దుర్మార్గపు చర్యలను కుట్రలను తిప్పి కొడతాం

- ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-మద్నూర్
జుక్కల్ ఎమ్మెల్యే విద్యావంతుడు.. అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని మద్నూర్ మార్కెట్ కమిటీ ఎంపికలో ఎమ్మెల్యే చేపట్టిన విధానం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పలువురు అభినందిస్తుంటే పార్టీ వ్యతిరేక శక్తులు చేస్తున్న దుర్మార్గపు చర్యలను కుట్రలను తిట్టికొట్టడానికి పార్టీ నాయకులు కార్యకర్తలు, సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తెలిపారు. ముఖ్యమంత్రి, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు చిత్రపటాలకు మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు ధరాస్ సాయిలు, పార్టీ సీనియర్ నాయకులు విట్టల్ గురుజీ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు

- నిజాయితీగా పనిచేసే నాయకులకు గుర్తింపు
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నవతెలంగాణ-బిచ్కుంద
నా నియోజకవర్గంలో చీడపురుగు రాజకీయాలు నడవవని కొందరు వ్యక్తులు నాపై పనికిరాని ఆరోపణలు చేస్తున్నారని తాటాకు చప్పుళ్ళకు భయపడేది లేదని నిజాయితీగా పనిచేసే కాంగ్రెస్ నాయకులకు కార్యకర్తలకు గుర్తింపు తప్పక ఉంటుందని జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావు అన్నారు. శుక్రవారం బిచ్కుంద మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మాజీ ఎమ్మెల్యే బంధువును కాంగ్రెస్ పార్టీలో నుంచి సస్పెండ్ చేసినా.. కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ అవినీతిపరులు, పనికిమాలిన వాళ్ళను వెంపటేసుకొని అసత్య ఆరోపణలు చేస్తూ తిరుగుతున్నారన్నారు. రాజకీయాల్లో కొత్త ఒరవడికి నాంది పలకాలని ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలనే ఉద్దేశంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నియమకాలను ఒక నూతన ఇంటర్వ్యూ పద్ధతిలో నియామకం ప్రక్రియ మొదలు పెట్టి నియామకం చేసినట్టు తెలిపారు. ఇది మహోన్నతమైన యజ్ఞమని వివరించారు. ఇలాంటి యజ్ఞాలు చేసేటప్పుడు కూటమిగా ఏర్పడిన రాక్షస మూకలు ఆరోపణలు చేయడం సర్వసాధారణమని, ఇలాంటి వాటికి భయపడేది లేదని అన్నారు. నామినేటెడ్ పద్ధతిలో భర్తీ చేయాల్సిన చైర్మన్ నియామక పదవిని ఒక నూతన పద్ధతిలో భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా ఇంటర్వ్యూ నిర్వహించి భర్తీ చేసిన ఘనత మన జుక్కల్ నియోజకవర్గానికి దక్కిందని అన్నారు. ఢిల్లీ, మహారాష్ట్ర, ఝార్ఖండ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి తనకు ప్రశంసలు వస్తున్నాయని తనపై నమ్మకంతో గెలిపించిన జుక్కల్ నియోజకవర్గం ప్రజలకు అంకితం ఇస్తున్నాన్నారు. ఈ మహత్కారానికి తోడుగా నిలిచిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ఆయన వెంట పిసిసి డెలికేట్ విట్టల్‌రెడ్డి, సీనియర్ నాయకులు గోపాల్‌రెడ్డి పటేల్, మాజీ డిసీసీబి డైరెక్టర్ వెంకటరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు దర్పల్ గంగాధర్, పుల్కల్ సొసైటీ చైర్మన్ బీమ్‌పటేల్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి సాయిస్థాఫిర్దోస్



వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-ఎడపల్లి
రోగాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాయిస్థాఫిర్దోస్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఏఆర్ క్యాంప్ గ్రామంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవడం హర్షణీయమన్నారు. చలికాలం ముగిసే వరకు గర్భిణీ, బాలింతలు, వృద్ధులు, చిన్నారులు జాగ్రతలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో సూర్య ఆరోగ్య సంస్థ నిర్వహణ అధికారి రాజేంద్ర కుమార్ విక్రమ్, ఆయుష్ ఆయుర్వేదిక వైద్యులు సాత్విక, సూర్య ఆరోగ్య ఆసుపత్రి కోఆర్డినేటర్ వినోద్ కుమార్, ఆప్త ప్రత్యేక వైద్యులు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

డయాబెటిస్, ఉచిత కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-ఎడపల్లి
మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి ఆధ్వర్యంలో ఒకే వేదికపై డయాబెటిస్, ఉచిత కంటి వైద్య శిబిరాలను శుక్రవారం నిర్వహించారు. ఇందులో మొదటగా గ్రామంలో ఉన్న 42 మందికి డయాబెటిస్ పరీక్షలను వైద్యులు నిర్వహించారు. అందులో 15 మందికి షుగర్‌వ్యాధి ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. అలాగే గ్రామంలో ఉన్న వృద్ధులకు పలువురికి మొబైల్ వ్యాన్ ద్వారా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో సుమారు 45 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జి.ఈ.టి కోఆర్డినేటర్ సూర్యనారాయణ, లయన్స్ డిసి మెర్సీ, లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి అధ్యక్షులు మనోజ్ కుమార్, నిడదవోలు రాకేష్ వర్మ, కోశాధికారి గంగారెడ్డి, పాల్గొన్నారు.

బోనాల పండుగ



బోనాల పండుగలో పాల్గొన్న రైతులు

నవతెలంగాణ-బోధన్
బోధన్ పట్టణంలోని రైతుల ఆధ్వర్యంలో కార్తీక మాసం పురస్కరించుకొని బోనాల పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ శివారులోని పసుపు వాగు వద్ద నుంచి బోనాలతో మహిళలు, రైతులు బెల్లాల్ చెరువు కట్టపై గల పాప నాగమ్మ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు, మహిళలు, పాల్గొన్నారు.

బోనస్‌తో రైతుల జీవితాల్లో వెలుగు

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్
- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-రెంజల్
ఆరుగాలం కష్టించి పండించిన రైతులకు క్వింటాలుకు రూ.500 ప్రకటించడం రైతుల జీవితాల్లో వెలుగు నింపిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్ స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ వడ్డీలు తీసుకువచ్చి రైతులకు బోనస్ ప్రకటించడం హర్షనీయమన్నారు. జిల్లాలో 30 కోట్ల పైచిలుకు రైతుల ఖాతాలో జమ



రెంజల్ : చిత్రపటానికి పాలాభిషేకం చేసిన నాయకులు

చేసినట్టు వివరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే సంక్షేమ పథకాలు అమలు చేయడంలో గర్వంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జి.సాయిరెడ్డి, సురేందర్‌గౌడ్, జావీద్, సింగిల్‌విండో చైర్మన్ మొయినుద్దీన్, ధనుంజయ్, సాయిబాబాగౌడ్, ఎం.ఎల్.రాజు, లచ్చేవార్ నితిన్, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్‌లు, తదితరులు పాల్గొన్నారు.



ఎడపల్లి : పోచారం గ్రామంలో..

సాటాపూర్‌లో మొరం రోడ్ల పనులు ప్రారంభం..
మండలంలోని సాటాపూర్ గ్రామంలో పెద్దమ్మ గుడి నుంచి పెంట రోడ్డు వరకు నిధులు మంజూరు కావడంతో పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఆర్ ఈజీఎస్ కింద రైతుల పంట పొలాల్లో ఉన్న రోడ్లకు మొరం పనులు మంజూరు అయ్యాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ మండల అధ్య క్షులు లచ్చేవార్ నితీన్, మాజీ సర్పంచ్ జావిద్ ఉద్దీన్, డైరెక్టర్ సాయిలు, హాజీ ఖాన్, రైతులు చంద్రశేఖర్, రాకేష్, సాయిలు, పిట్ల భూమేష్, స్థానిక రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండలంలోని ఎడపల్లి, పోచారం గ్రామాలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ శంకర్ నాయుడు, దూపల్లి సొసైటీ డైరెక్టర్ పోచారం గ్రామానికి చెందిన నీరెడి రవికుమార్ మాట్లాడారు. రైతులను దృష్టిలో పెట్టుకొని కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించిన రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ మంజూరు చేయడం పట్ల నాయకులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మచుకూరి గంగాధర్, కోల విజయ్ చందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పదవి రాలేదని అక్కసు

- పార్టీలు మారిన వారే.. ధర్నా చేశారు..

నవతెలంగాణ-నసురుల్లాబాద్
బీర్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎంపిక పారదర్శకంగా జరిగిందని, బీర్కూర్ మండలంలో ఏనుగు రవీందర్ రెడ్డి గ్రూప్ నాయకులు ధర్నా చేయడం హాస్యస్పదంగా ఉందని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెరిక శ్రీనివాస్ తెలిపారు శుక్రవారం మండల కేంద్రంలోని అంకోల్ క్యాంప్ లో బీర్కూర్ ఉమ్మడి మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీర్కూర్ మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి గ్రూప్ నాయకులు కొందరు మార్కెట్ కమిటీ పదవి రాలేదని అక్కస్సుతో నిరసన వ్యక్తం చేయడం, పోచారం శ్రీనివాస్ రెడ్డి పై నిందలు వేయడమే పనిగా పెట్టుకున్నారని ఆయన ఆరోపించారు. బీర్కూర్ మండల కేంద్రంలో గురువారం ధర్నా చేసిన నాయకుల్లో చాలామంది కాంగ్రెస్ పార్టీలో ఉంటూనే వివిధ పార్టీలో చేరి కండువాలు కప్పుకున్నారని ఆయన తెలిపారు. ఆ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు బిజెపి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకొని లబ్ధిపొంది కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వారి వ్యక్తిగత స్వార్థం కోసం కండువాలు పక్కకు పెట్టి మళ్లీ తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరి మేమే సీనియర్ నాయకులమంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీని బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పాల్త్య విఠల్, రఘు, సీనియర్ నాయకులు శ్యామల, రాము, సందీప్ పటేల్, ఖరీఫ్, ప్రతాప్ సింగ్, మోహన్, సక్రు, మజీద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్ పట్టివేత



నవతెలంగాణ-నిజాంసాగర్
మహ్మద్‌నగర్ మండల కేంద్రంలో ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మంగ మల్లయ్య అనే వ్యక్తిని పట్టుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి ఆ ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు ఆయన తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా ఇసుక అక్రమ రవాణా చేసినట్లయితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సమగ్ర కుటుంబ సర్వే డాటాఎంట్రీ పరిశీలన



సర్వే నమోదును పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-రెంజల్/నాగిరెడ్డిపేట్
మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమగ్ర కుటుంబ సర్వే డాటాను ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. డాటా ఎంట్రీలో ఎలాంటి తప్పులు లేకుండా సరిచేయాలని సిబ్బందికి సూచించారు. ఆయా గ్రామాలలో 100శాతం పూర్తి చేసిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను డాటా ఎంట్రీ చేయాలని గ్రామ కార్యదర్శులకు తెలిపారు. డాటా ఎంట్రీలో ఎలాంటి తప్పులు రాకుండా ప్రైవేట్ ఆపరేటర్లను నియమించినట్టు ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ పేర్కొన్నారు.

సమగ్ర సర్వే డాటా ఎంట్రీ పరిశీలన
నాగిరెడ్డిపేట్ : నాగిరెడ్డిపేట్ మండలంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఎంపీడీవో ప్రభాకర్ చారి తెలిపారు. శుక్రవారం డేటా ఎంట్రీ వివరాలను మండల ప్రత్యేక అధికారి ఏడిఏ రత్నం, ఎంపీడీవో ప్రభాకర్ చారి పరిశీలించారు. తప్పులు లేకుండా డాటా ఎంట్రీ చేయాలని సంబంధిత కంప్యూటర్ ఆపరేటర్లకు వారు సూచించారు.

అభివృద్ధి పనుల కోసం తీర్మానం



సమావేశంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ

నవతెలంగాణ-వర్ని
మండల కేంద్రంలో గల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కమిటీ మొదటి సమావేశం చైర్మన్ కులకర్ణి సురేష్ బాబా ఆధ్వర్యంలో కొనసాగింది. ఈ సందర్భంగా డైరెక్టర్‌లతో మార్కెట్ కమిటీ అభివృద్ధి పనులపై చర్చించారు. మార్కెట్ కమిటీ ఆవరణలో సీసీ రోడ్డు, మిగతా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కొరకు రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. రైతుకు వడ్డీ లేని రుణం రూ.లక్ష 50 వేలు చెక్కును అందజేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ కోటిమికర్ లక్ష్మణ్, డైరెక్టర్‌లు సుధాకర్‌రావు, హైమద్, సీతఓ శ్రీనివాస్, పలువురు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నాయికమ్మ ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-తాడ్వాయి
మండలంలోని చిట్యాల గ్రామంలో నాయికమ్మ మహోత్సవాలు వైభవంగా నిర్వహించినట్టు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. బోనాలు, డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపు చేశారు. అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాలకు గ్రామానికి చెందిన అంబిరు నరేందర్‌రావు, హంబీర్ మనోహర్‌రావు, భువనేశ్వర్ రావుల సహకారంతో ఈ ఉత్సవాలు నిర్వహించారు.

వడ్డేపల్లి సుభాష్‌రెడ్డికి పార్టీ షోకాజ్ నోటీస్

నవతెలంగాణ-రామారెడ్డి/లింగంపేట్
కాంగ్రెస్ సీనియర్ నాయకులు వడ్డేపల్లి సుభాష్ రెడ్డికి గురువారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ చిన్నారెడ్డి షోకాజ్ నోటీసు జారీచేశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు మదన్మోహన్‌రావుపై అసత్యపు ఆరోపణలు, కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారంటీల అమలుపై వ్యతిరేకంగా మాట్లాడినందుకు నోటీసు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

ఆదర్శలో టీచర్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నిజాంసాగర్
మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇటీవలే బదిలీపై వెళ్లిన టీచర్ల స్థానాలలో పిజిటి ఫిజిక్స్-1 సబ్జెక్టులో హవర్‌లీ బేసెడ్ ప్రతిపాదికన బోధించేందుకు ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 23 నుంచి 25వ వరకు పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ పోస్టులకు అర్హతలు పీజీ, బిఎడ్, టెట్ క్వాలిఫై అయి ఉండాలని, డెమో క్లాస్ ఈనెల 26వ తేదీన పాఠశాలలో ఇవ్వాల్సి ఉంటుందని సూచించారు. పార్ట్ టైం క్లాసులు చెప్పుకొని వెళ్లడానికి కూడా అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు.

సర్వే వివరాల కంప్యూటరీకరణ ప్రారంభం

నవతెలంగాణ-రామారెడ్డి
మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో సేకరించిన వివరాలను డాటా నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి సంజయ్ కుమార్, డిఎల్‌పిఓ శ్రీనివాస్ పరిశీలించారు. వివరాల నమోదును తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతిరెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

- సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి

నవతెలంగాణ-నసురుల్లాబాద్
విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్ కుప్పిశెట్టి కిరణ్మయి సూచించారు. శుక్రవారం నసురుల్లాబాద్ మండలంలో గిరిజన గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సమాజ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతో పాటు వినయం, విధేయత, సంస్కారం, మానవతా విలువలను కూడా నేర్పించాలన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి విద్యనభ్యసించి తమ తల్లిదండ్రులకు తమ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, క్రీడల్లో రాణించడం వల్ల విద్య ఉద్యోగాల్లో వారికి మొదటి ప్రాధాన్యం లభిస్తుందన్నారు. వీరి వెంట తహసీల్దార్ బావయ్య, ప్రిన్సిపాల్ మాధవరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

సర్వే డాటా ఎంట్రీలో తప్పులు లేకుండా చూడండి..
సమగ్ర కుటుంబ సర్వేలో సేకరించిన వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి సూచించారు. బాన్సువాడ డివిజన్ పరిధిలోని బీర్కూర్, నసురుల్లాబాద్, బాన్సువాడ తదితర మండలాల్లో సమగ్ర సర్వే డాటా ఎంట్రీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నసురుల్లాబాద్ తహసిల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటింటికి తిరిగి సర్వేలో సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ఎన్యుమరేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు పలు సూచనలు ఇచ్చారు. సర్వే వివరాలు గోప్యంగా ఉంచాలని, దరఖాస్తు ఫారాలను జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. నసురుల్లాబాద్ మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, గురుకుల పాఠశాలలో డాటా ఎంట్రీ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. డాటా ఎంట్రీ కేంద్రాల్లో సమగ్ర కుటుంబ సర్వే వివరాలను జాగ్రత్తగా చేయాలని ఎలాంటి తప్పులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పరిధి అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ డాటా ఎంట్రీ చేయాలన్నారు. బాన్సువాడ డివిజన్ పరిధిలో ఎన్యుమనేటర్లకు ప్రజలు సహకరించడం వల్ల సర్వే వేగంగా జరుగుతుందన్నారు. వీరి వెంట తహసిల్దార్ బావయ్య ఇంచార్జ్ ఎంపీడీవో సూర్యకాంత్, ఆర్ఐ సాయిలు, రెవెన్యూ ఎంపీడీవో కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణం పేరిట చందాలు

- డబ్బులు వసూలు చేస్తున్న యువతపై చర్యలు తీసుకోవాలి
- వినాయక్‌నగర్ హనుమాన్ కమిటీ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో వినాయక్ నగర్ హనుమాన్ టెంపుల్ కు దాత లు సహాయం చేస్తున్న సందర్భంలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న యువతపై చర్యలు తీసుకోవాలని వినాయక్ నగర్ హనుమాన్ కమిటీ సభ్యులు శుక్రవారం డిమాండ్ చేశారు. గోసంగి సంఘం ఆధ్వర్యంలో 22వ డివిజన్ పరిధిలోని ఒడ్డెపు లింగన్న దాతగా వ్యవహరిస్తూ వినాయక్ నగర్ హనుమాన్ టెంపుల్‌ను ఆయన డబ్బులతో నిర్మిస్తే కొందరు యువకులు హనుమాన్ టెంపుల్ నిర్మాణం పేరిట పేరిట చందాలు వసూలు చేస్తున్నారని తెలిపారు. అలాంటి వారిని అరెస్ట్ చేయాలని వినాయక్ నగర్ టెంపుల్ కమిటీ అధ్యక్షులు కృష్ణ కోరారు.

ఆలూర్‌లో రైతుల బోనస్ సంబరాలు

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూరు మండల కేంద్రంలో రైతుల ఆధ్వర్యంలో రైతు బోనస్ సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముక్కెర విజయ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం కొనుగోలు చేసిన ప్రతి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ రైతుల ఖాతాలలో జమ చేసిందన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి, నియోజకవర్గ ఇన్చార్జ్ వినయ్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలూరు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్, వైస్ మల్లారెడ్డి, ఉదయ్, ముత్యం, నవనీత్, సంజీవ్, గంగారెడ్డి, అనిల్, రాజేందర్, రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులను మోసం చేసిన సిఎం రేవంత్ రెడ్డి

- విహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

పెన్షన్ దారులను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని ప్రజా కోర్టులో రేవంత్ రెడ్డిని పెన్షన్ దారులు నిలబెడతారని విహెచ్పిఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ అన్నారు. శుక్రవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి పెన్షన్ పెంపుకై చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు 5వ రోజుకు చేరుకుంది. 5వ రోజుకు రిలే నిరాహారదీక్షలకు విహెచ్పిఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు గడిచిన పెంచుతున్న అన్ని సామాజిక పెన్షన్లను పెంచకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వికలాంగులకు ఇంకా ఎన్నో హామీలు అందజేశారు. వికలాంగుల మంత్రిత్వ శాఖను ఏర్పాటు చెయ్యాలని, వికలాంగులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి హామీలను అమలుపరచాలన్నారు. లేకుంటే నవంబరు 26న పెన్షన్ దారుల మహాగర్జన పేరుతో ఇందిర పార్కులో లక్షలాది పెన్షన్ దారులతో అన్నిరాజకీయ పార్టీలను అఖిలపక్షంగా భాగస్వామ్యం చేసి రేవంత్‌రెడ్డి మీద యుద్ధం ప్రకటిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎన్టీఆర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. సుమారు 20 నిమిషాల పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడిందన్నారు. 20నిమిషాలపాటు రెండు వైపులా రోడ్డుపై భీష్మించి కూర్చున్నారు. ఈ దీక్షలో విహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు కంఠేశ్వర్ బీరప్ప, విహెచ్పిఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల నారాయణ, జిల్లా నాయకులు విహెచ్పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ సలీం, మహిళా విభాగం అధ్యక్షురాలు చిట్టి కృష్ణవేణి, భామని పోశెట్టి, గంధాల గంగాధర్, శ్రీనివాస్ యాదవ్, తిరుమల నాయక్, రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న పెన్షన్ దారులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఎల్లారెడ్డి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎల్లారెడ్డి టౌన్, పెద్దారెడ్డి, మత్తమాల పరిధిలోని 33 /11 కేవీ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

జడ్జీలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బార్



జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బార్ సభ్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల, నిజామాబాద్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబులకు నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ ఆధ్వర్యంలోని న్యాయవాదుల బృదం జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లాకోర్టు ప్రాంగణంలోని జడ్జిల చాంబర్లలో కలిసి పూలమాలలు, స్వీట్స్ అందజేసి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. బార్ అండ్ బెంచ్ మధ్య చాలా మంచి సమన్వయం ఉన్నదని, అది భవిష్యత్ కాలంలో కొనసాగి కక్షిదారులకు న్యాయసేవలు మరింత విస్తరించాలని జగన్ ఆశించారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ కు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మంచిపేరు ఉన్నదని, న్యాయవాద సమాజం సహకారంతో కక్షిదారులకు చట్ట సంబంధిత విషయాల్లో ఎలాంటి సమస్యలు లేవని జిల్లాజడ్జి సునీత, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు అన్నారు. నిజామాబాద్ బార్ అనే కుటుంబ సభ్యుల మధ్య ఇమిడి పోయి ప్రజలకు న్యాయవ్యవస్థ పనితీరును విస్తరించుకున్నామని వారు తెలిపారు. జగన్ వెంట చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్ కుమార్ సుబేధార్,బార్ ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి వసంత్ రావు,లైబ్రరీ కార్యదర్శి పిల్లి శ్రీకాంత్, న్యాయవాదులు ఆర్.ఎస్.ఎల్ గౌడ్, ఆశనారాయణ, వినయ్ కుమార్, బిట్ల రవి, చిన్న నాయక్, అపూర్వ, ఉదయ కృష్ణ, ప్రమోద్, శుభం, చుక్కబొట్ల రాజు, కేశవరావు, తదితరులు ఉన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ప్రారంభం



సమగ్ర సర్వేను డాటా ఎంట్రీ చేస్తున్న సిబ్బంది

నవతెలంగాణ-మోపాల్

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ శుక్ర వారం నుండి ప్రారంభించారు. డేటా ఎంట్రీ చేసేవారికి ఆన్లైన్లో దరఖాస్తులను తప్పులు లేకుండా నమోదు చేయాలని తెలిపారు. ఎంపిడిఓ రాములు నాయక్, ఎంపిఓ కిరణ్ కుమార్, మండల సిబ్బంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

పీఎంఎఫ్‌ఎంఈపై అవగాహన



అవగాహన సదస్సులో పాల్గొన్న మహిళ సంఘం సభ్యులు, పలువురు

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

ఐకేపీ ఆధ్వర్యంలో (పీఎంఎఫ్ఎంఈ) ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థల వ్యవస్థీకరణ పథకంలో తీసుకున్న లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డిపిఎం మారుతి మాట్లాడుతూ.. సూక్ష్మ ఆహార ఉత్పత్తులు తయారీ చేసుకునే మహిళా సంఘ సభ్యులకు పీఎంఎఫ్ఎంఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈ పథకంలో తీసుకున్న వారికి లక్షకు 35శాతం సబ్సిడీ ఉంటుందని తెలిపారు. ఈ పథకంలో 50 లక్షల వరకు సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు. ఈ పథకంలో గానుగ నూనెలు, దాల్ మిల్లులు, పిండిగిర్ని, కారం గిర్నిలో, అల్లం ఎల్లిగడ్డ మిషన్లు కూడా తీసుకోవచ్చని అన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపిఎం రవీందర్ సీసీలు కుంట శ్రీనివాస్, నరేష్, రఘుపతి, గంగాధర్, భాస్కర్, గంగ, లలిత, ముత్యం, గణేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

24, 25న కార్యకర్తలకు రాజకీయ శిక్షణ తరగతులు

- జయప్రదం చేయండి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈ నెల 24, 25వ తేదీల్లో సిపిఐ(ఎం) పార్టీ ముఖ్య కార్యకర్తలకు రెండు రోజులపాటు రాజకీయ శిక్షణ తరగతులు జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి ఏ.రమేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రాజకీయ శిక్షణ తరగతులను బోధించటానికి రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్, బండారు రవికుమార్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో పార్టీ మౌలిక సూత్రాలను, రాజకీయ విధానాన్ని, పార్టీ కార్యకర్తల కర్తవ్యాలను బోధించడం జరుగుతుందని తెలిపారు. తదనుగుణంగా పార్టీ కార్యకర్తల్లో రాజకీయ నిబద్ధత పెరిగి మరింత చురుకుగా పని చేయటానికి వీలవుతుందని అన్నారు. అందువల్ల పార్టీ కార్యకర్తలు తప్పనిసరిగా ఈ రాజకీయ శిక్షణ తరగతులకు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ క్లాసుల తదనంతరం ఏరియాల వారీగా పార్టీ సభ్యులకు మరొక దఫాలో క్లాసులు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు.

వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారంకోసం రాష్ట్రవ్యాప్త ఉద్యమం

- రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి
- అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్)

నవతెలంగాణ-సిరికొండ

వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారంకోసం రాష్ట్రవ్యాపిత ఉద్యమం చేపట్టామని అన్ని మండలాల్లో, జిల్లా కేంద్రాల్లో పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకోవాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) రాష్ట్ర ప్రధానకార్యదర్శి పిట్ల రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గడ్కోల్ గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో వ్యవసాయ కార్మికులు 80లక్షల మంది ఉన్నారని అన్నారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి కరువవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో పని లేక కాలేకడుపు చేతవట్టుకొని వలస వెళ్తున్న దుస్థితి నెలకొన్నదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐపీకేఎంఎస్ జిల్లా నాయకులు కిషోర్, సాయిరెడ్డి, కిషోర్, కట్ట. రామన్న సీపీఐఎంఎల్ మాస్ లైన్ మండల నాయకులు లింబాద్రి, పీవైఎల్ జిల్లా అధ్యక్షులు అనిష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అంకాపూర్ గ్రామాన్ని సందర్శించిన ఒరిస్సా రాష్ట్ర జడ్పిటిసిలు, సర్పంచులు



అంకాపూర్‌ను సందర్శించిన ఒరిస్సా రాష్ట్ర జడ్పిటిసి, సర్పంచులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఒరిస్సా నుండి రాష్ట్ర పర్యటనలో భాగంగా ఒడిశాకు సంబంధించిన సర్పంచులు, జడ్పిటిసి లు, పంచాయతీ కార్యదర్శులు, మండల పంచాయతీ అధికారులు, ఇతర రాష్ట్ర అధికారులు శుక్రవారం అంకాపూర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిపి అడ్మినిస్ట్రేషన్ వ్యవసాయంలో జరిగిన అభివృద్ధి గురించి, వీడిసి చేపట్టే కార్యక్రమాల గురించి, ప్రాసెసింగ్ యూనిట్ గురించి తెలుసుకున్నారు. వీరితోపాటు మన రాష్ట్రానికి సంబంధించిన టిఎస్ఐఆర్‌డి అధికారులు, ఎంపీఓ శ్రీనివాస్, ఏవో, ఏపీఓ, గ్రామ కార్యదర్శి, జూనియర్ అసిస్టెంట్, ఏఈఓ, గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ యూనివర్సిటీ భూములను రక్షించండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కబ్జాయినా తెలంగాణ యూనివర్సిటీ భూములను స్వాధీనం చేసుకొని, కబ్జాదారుల నుండి రక్షించాలని, యూనివర్సిటీ చుట్టూరా ప్రహరీగోడ నిర్మించుటయిఱ తగు చర్యలు తీసుకోవాలని పిడిఎస్యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ మాట్లాడుతూ.. 574 ఎకరాల భూములను అప్పటి ప్రభుత్వం యూనివర్సిటీకి కేటాయించారన్నారు. టియు భూముల్లో 54 ఎకరాలను తమ సొంత కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు తప్పుడు రికార్డులతో భూమిని కాజేయాలని చూస్తే, అప్పటి మంత్రి సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ వరప్రసాద్ స్పందించి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు వత్తాసు పలికిన ఎమ్మార్వో రవికుమార్ ను సస్పెండ్ చేశారన్నారు. ఈ భూములను దక్కించుకోవాలని రియల్ ఎస్టేట్స్ వ్యాపారులు కోర్టుకు వెళితే కోర్టు సైతం తెలంగాణ యూనివర్సిటీకి అనుకూలంగా తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ ఈ 54 ఎకరాల తెయూ. భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారుల, కబ్జాదారుల నుండి కాపాడి పూర్తిస్థాయిలో తెలంగాణ యూనివర్సిటీకి అప్పగించాలని కోరారు. ఈ కేసులో ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని యూనివర్సిటీ భూమిని పరిరక్షించేలా తగు చర్యలు తీసుకోవాలని, ఇందుకు జిల్లా కలెక్టర్ బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పిడిఎస్యు నాయకులు తరుణ్, మహేష్, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

26న ప్రదర్శనలను జయప్రదం చేయండి

- మోడీ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసన
- ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భూమన్న, దాసు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నరేంద్ర మోడీ సర్కార్ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా నవంబర్ 26న దేశవ్యాప్తంగా జరిగే నిరసన ప్రదర్శనల్లో భాగంగా నిజామాబాద్‌లో జరిగే ప్రదర్శనను జయప్రదం చేయాలని కార్మిక లోకానికి ఐఎఫ్టియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భూమన్న, దాసు విజ్ఞప్తి చేశారు. నిజామాబాద్ నగరంలోని కోటగల్లిలో నీలం రామచంద్రయ్య భవన్‌లో శుక్రవారం పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ 10సంవత్సరాల పరిపాలన ఎన్నికల వాగ్దానాలు విస్మరించి, అన్నదాత రైతన్నకు, సంపద సృష్టికర్త కార్మిక వర్గానికి మరణ శాసనం లిఖించాడని వారన్నారు. ఉపాధి భద్రత అంటూ ప్రగల్భాలు పలికి దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలని బహిరంగంగా అమ్మేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పంటకు గిట్టుబాటు ధర లేదు కానీ, నిత్యావసర సరుకుల ధరలను పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని వారు తెలిపారు. మోడీ ప్రధానమంత్రి పదవి చేపట్టిన నాడు 50 లక్షల కోట్ల అప్పు ఉంటే నేడు 175 లక్షల కోట్లకు పెరిగిందని వారు అన్నారు. ప్రతి భారతీయ పౌరుడు పై లక్ష ఇరవై ఐదువేల రూపాయలు అప్పు రుద్దిండని తెలిపారు. పెద్ద నోట్ల రద్దుతో అవినీతి, తీవ్రవాద నిర్మూలన అంటూ ఉపన్యాసాలు దంచి, నల్లధనాన్ని పెంచి, కార్పొరేట్ కనుసన్నుల్లో పాలన కొనసాగిస్తున్నాడని వారు ఆరోపించారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. బడా పారిశ్రామికవేత్తల ముసుగులో ప్రజా సంపదను కొల్లగొడుతున్న వారికి మోడీ అండగా నిలుస్తున్నారని ఈ తొమ్మిది సంవత్సరాల్లో బిజెపి 13 లక్షల 86 వేల రూపాయలు పారిశ్రామికవేత్తలకు రుణమాఫీ ప్రకటించి, కార్మికుల కనీస వేతనం అమలు చేయకపోవడం దుర్మార్గమని వారు అన్నారు. ప్రపంచంలోని 191 దేశాల జాబితాలో భారత దేశ పరిస్థితి ఆకలిలో107, పర్యావరణంలో 180 స్థానంలో ఉండడానికి మోడీ ప్రజా వ్యతిరేక విధానాలే కారణమని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను, వ్యవసాయ వ్యతిరేక మూడు నల్ల చట్టాలను మోడీ సర్కార్ వెంటనే ఉపసంహరించు కోవాలని దాసు డిమాండ్ చేశారు. ఈనెల 26 న జరిగే దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని దాసు, భూమన్న విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు సూర్య శివాజీ, జెల్లామురళి, కార్యదర్శులు శివకుమార్, జెపి గంగాధర్ . కోశాధికారి దాల్మల్కి పోశెట్టి, నాయకులు మోహన్, భారతి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎఫ్టియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

లగచర్ల గిరిజనులపై అర్ధరాత్రి పోలీసుల దౌర్జన్యాన్ని ఖండించాలి

- సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్

నవతెలంగాణ-ఆర్మూర్

దౌర్జన్యపూరితంగా గిరిజనుల భూములను ఫార్మా కంపెనీకోసం తీసుకోవడం అప్రజాస్వామ్యమని, లగచర్ల గిరిజనుల పైన అర్ధరాత్రి పోలీసుల దౌర్జన్యాన్ని ఖండించాలని. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఆరోగ్యారెంటీల పేరుతో సంక్షేమ పథకాలను ప్రచారంచేసి ఏడవ గ్యారెంటీ తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని, దొరల పాలన కొనసాగుతుందని., ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తామని, హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి ఆరు గ్యారెంటీల అమలు సంపూర్ణం కాలేదని, రైతు భరోసాకు అతీ గతి లేదని, ఏకకాలంలో రెండు లక్షల రూపాయలు రుణమాఫీ 40శాతం పూర్తయిందని ఎద్దేవా చేశారు.

గ్రూప్ వన్ విద్యార్థుల సమస్యపై ప్రశ్నించిన వారిపైన లాఠీలు, కేసులు పెట్టిందని అన్నారు. గత ప్రభుత్వం మల్లన్న సాగర్ రైతాంగ ఉద్యమాన్ని దౌర్జన్యంగా కేసులతో ఇబ్బందుల గురిచేసిందని రేవంత్ రెడ్డి చెప్పారన్నారు. తన సొంత నియోజకవర్గంలో ఫార్మా కంపెనీ కోసం గత ప్రభుత్వం అప్పటికే 16వేల ఎకరాల భూముల సేకరించిన సరిపోవని మరో 1300 ఎకరాల భూముల సేకరణకు ఆదేశాలు జారీ చేశారన్నారు. అడవి బిడ్డలైన గిరిజనులు తమ జీవనాధారమైన సాగు భూములను ఇవ్వబోమని తెగేసి చెప్పడంతో లగ చర్ల గిరిజన తండాలపై అర్ధ రాత్రి పోలీసుల దాడులు కొనసాగించా రన్నారు. అక్రమ కేసులు పెట్టి జైలు పాలు చేశార ని అన్నారు. విద్యుత్, ఇంటర్నెట్ సేవలను నిలిపేశారని, ఇది ఎక్కడి ప్రజాస్వామ్యమని రేవంత్ రెడ్డిని ప్రశ్నించా రు. తన నియోజక వర్గంలోని భూస్వామికి చెందిన 11 ఎకరాల సీలింగ్ భూమి రేవంత్ రెడ్డికి కనిపించ లేదా? గిరిజన, దళిత, బిసి వర్గాల భూములే ఫార్మా కంపెనీకి అవసరమా? భూస్వాముల భూములు ఫార్మసీ కంపెనీలకు పనికిరావా అని ప్రశ్నించారు. నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల నుంచి ఫార్మా కంపెనీకి నీళ్లు ఇవ్వడానికి కూడా రంగం సిద్ధం చేశారని, ఇది ఎక్కడి న్యాయమని ప్రశ్నించారు. వెంటనే గిరిజన రైతులపైన పెట్టిన కేసుల్ని ఉప సంహరించుకోవాలని బలవంతంగా భూములు లాక్కోవద్దని డిమాండ్ చేశారు. కొడంగల్ చుట్టుపక్కల యుద్ధ వాతవరణం ఉందని, క్యాంపులు విస్తృతంగా ఏర్పాటుచేసి ప్రజల నిత్యావసర పనులకు సైతం ఆటంకాలు కల్పిస్తున్నారని అన్నారు. బంధువుని సైతం అనేక ప్రశ్నలు వేసి వదులుతున్నారని, కొత్తవారిని ఎవరి ఒక్కరిని కూడా ఆ ప్రాంతం రానీయకుండా కట్టుదిట్టాలు చేయడం ఇది ఎక్కడి ప్రజా పాలన అని అన్నారు. ఏఐపీకెఎస్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి. బి దేవారం మాట్లాడుతూ... కార్పొరేట్లకు రైతుల భూముల్ని అప్పచెప్పడానికి మూడు నల్ల చట్టాలు తీసుకువస్తే రైతులు ఉద్యమం చేసి 750 మంది రైతుల త్యాగంతో మోడీ సర్కారు తగిన బుద్ధి చెప్పిందని గుర్తు చేశారు. ఈ వెలుగులోనే కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్లు తీసుకొచ్చి ఎనిమిది గంటల పని విధానానికి మంగళం పాడడానికి ప్రయత్నిస్తున్నారని దీనికి వ్యతిరేకంగా ఈనెల 26న జరిగే జాతీయ ఉద్యమాన్ని జిల్లా కేంద్రంలో జయప్రదం చేయాలని కార్మిక రైతాంగానికి ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలోమాస్ లైన్ మండల సంయుక్తకార్యదర్శి జిల్లా నాయకురాలు. సత్యక్క, పివైఎల్ జిల్లా కార్యదర్శి, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు. నరేందర్, అనీష్, అరవింద్, జిల్లా సహాయ కార్యదర్శి రవి, మనోజ్, శ్రీను, పద్మ, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్

దిశ కమిటీ సభ్యునిగా రాజు దేశ్‌ముఖ్ నియామకం



నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రానికి చెందిన రాజు దేశముఖ్ కామారెడ్డి జిల్లా దిశ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్ చైర్ పర్సన్ జిల్లా కలెక్టర్ మెంబర్ సెక్రెటరీగా జిల్లాలోని నలుగురు ఎమ్మెల్యేలు నామినేటెడ్ చేసిన మరో ఐదుగురు సభ్యులుగా దిశ కమిటీలో కొనసాగుతారని జిల్లా కలెక్టర్ ఉత్తర్వులో పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన రాజు దేశ్ముఖ్ జిల్లా దిశ కమిటీల సభ్యునిగా నియమితులు కావడంతో మండల ప్రజలు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జైరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షట్కర్ ప్రధాన అనుచరుడు దిశ కమిటీ లో నియమితులు కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ అధికారులకు సన్మానం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి డివిజన్ కేంద్రంలోని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీరింగ్ కార్యాలయంలో ఇటీవల బదిలీపై వచ్చి నూతనంగా బాధ్యతలు చేపట్టిన డి.ఇ. పార్థసారధి, ఏ.డి.ఇ. ప్రసాద్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు కురుమ సాయిబాబా ఆధ్వర్యంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు.

బాధితులకు పరామర్శ..

మండలంలోని శివపూర్ గ్రామానికి చెందిన ప్రభాకర్ అమ్మమ్మ ప్రమాదవశాత్తు కాలు విరిగిందని, అలాగే అన్నాసాగర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్‌కు రోడ్డు ప్రమాదంలో గాయపడి స్థానిక వెంకటేశ్వర హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారని తెలుసుకొని ఆస్పత్రికి వెళ్లి ఇరువురిని పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

సీతాఫలాలకు భలే గిరాకీ



- ఔషధ గుణాలు చాలా ఎక్కువ
- ఈ సంవత్సరం కాయలు సైతం అమ్మకాలు
- నిజామాబాద్‌లో భారీగా కొనుగోళ్లు

నవతెలంగాణ-కంఠేశ్వర్

శీతాకాలంలో ప్రత్యేకత కలిగిన పండ్లల్లో సీతాఫలం పండు ఒకటిగా పేరు పొందింది. సీజన్ ఆరంభం కాకముందే ఈ ఏడాది మార్కెట్లోకి సీతాఫలాలు వచ్చేశాయి. ఏ కాలంలో తినాల్సిన పండ్లు ఆ కాలంలో తినాలని ప్రజల్లో బలంగా ఉండటంతో ధర ఎక్కువైనా ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు. నిజామాబాద్ నగరంలో పాత కలెక్టర్ చౌరస్తా నుంచి ఎన్టీఆర్ చౌరస్తా మధ్యలో వివిధ మండలాల నుంచి సీతాఫలాలు రావడంతో పోటెత్తుతున్నాయి. మూడు నెలల పాటు ఉండే సీజన్లో వీటిని తినేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన వారు ఉదయం నుంచి రాత్రి వరకు కూర్చొని అమ్ముతున్నారు. వందకు 4 నుంచి 12 సైజును బట్టి విక్రయిస్తున్నారు. గుల్లాలు, క్యారెట్లు అయితే రూ.500 నుంచి 200 వరకు అమ్మకాలు జరుపుతున్నారు. మరికొందరు వందకు మూడు పండ్ల చొప్పున అమ్ముతున్నారు. ఏదేమైనా తప్పక తినాల్సిన పండు కాబట్టే కొంటున్నాం అంటున్నారు.

వీటిని పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ కూడా తినడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. సమృద్ధిగా విటమిన్-సీ ఉండే సీతాఫలం సీతాకాలంలో మూడు నెలల పాటు సీజనల్ లభ్యమవుతుందని వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు. ఎదిగే పిల్లలకు ఈ పండు చాలా మంచిదని, వీటిలో క్యాల్షియం, విటమిన్ సమృద్ధిగా దొరుకుతుందని తెలిపారు. ఆహారం తేలికగా జీర్ణమయ్యేందుకు సీతాఫలంలోని పీచు పదార్థం ఉపయోగపడుతుందని వైద్యులు సూచిస్తున్నారు. పంటపొలాల్లోని చెట్ల నుంచి కోసి తీసుకువస్తున్నామని విక్రయదారులు చెబుతున్నారు. అయితే కొందరు అడవి నుంచి తీసుకువస్తున్నట్లు చెబుతున్నారు.

కిలో 60 రూపాయలు మాత్రమే అని బోర్డులు...

ఉదయాన్నే గుల్లలో పండ్లను పెట్టుకొని కాలనీ, వీధుల్లో అమ్ముతున్నారు. కొందరు కొనుగోలు దారులు సైతం గంప గుత్తగా గుల్లలను కొనుగోలు చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఎన్నడు లేని విధంగా ఈ సంవత్సరం సీతాఫల కాయలకు కూడా భలే గిరాకీ ఉంది. గతంలో ఎన్నడు లేని విధంగా ఈ సంవత్సరం కాయలను తెచ్చి మరీ అమ్ముతున్న పరిస్థితి ఉంది. రోజులు మారుతున్న సమయంలో కాలానికి అనుగుణంగా అమ్మకాలు కూడా మారుతున్నాయి. మునుపెన్నడు కాయలు అమ్మేవారు కాదు. ఇప్పుడు ఎక్కువగా కాయలను కిలోల చొప్పున అమ్ముతున్నారు. ఇంట్లో వాటిని ఓ మూడు రోజులు పెడితే పక్వానికి వస్తున్నాయి. దానివల్ల ప్రజలు కూడా ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. సీతాఫలాల ద్వారా చిన్నపిల్లల నుండి ముసలి వారి వరకు చాలా ఇష్టపడతారు కాబట్టి ప్రజలు కూడా పండ్లను కాకుండా కాయలను కొనేందుకే ఎక్కువగా ఇష్టపడుతూ రూ.10 తక్కువైన 50 రూపాయలకు అడిగిమరీ కొంటున్నారు.

ప్రభుత్వ బడుల్లో విప్లవాత్మక మార్పులు

- ఎంఈఓ బట్టు రాజేశ్వర్



శిక్షణ ఇస్తున్న సాంకేతిక నిపుణుడు

నవతెలంగాణ-బాల్కొండ

ప్రభుత్వ బడుల్లో విప్లవాత్మక మార్పులు కనిపిస్తున్నాయని మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంఈవో బట్టు రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల పరిధిలోని ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్‌పై(ఐఎఫ్‌పి) శిక్షణ ఇచ్చారు. ఇప్పటి వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బ్లాక్ బోర్డుపైన ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధిస్తున్నారు.. తాజాగా బ్లాక్ బోర్డ్ స్థానంలో ఐఎఫ్‌పిలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. వీటితో బోధన తీరు మరింత మెరుగుపడుతుందని ఎంఈఓ అన్నారు. ఐఎఫ్‌పిపై సాంకేతిక నిపుణులు రాకేష్ ఉపాధ్యాయులకు శిక్షణను ఇచ్చారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ మోపాల్

మండలంలోని మంచిప్ప గ్రామంలో రైతుల ఎకౌంట్లో బోనస్ వేసిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి చిత్రపటాలకు శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందంటే కచ్చితంగా కట్టుబడి ఉంటుందని ఇది ప్రతిపక్షాలకు చెంపపెట్టు లాంటిదని, ఇది కర్షక ప్రభుత్వమని రైతుల కోసం ఎంతైనా చేస్తుందని వారు తెలిపారు. కార్యక్రమంలో ముత్యం రెడ్డి, సాయిరాం, రాజేష్, భూపతి రెడ్డి, మోహనరెడ్డి, వడ్ల నరేందర్, గొల్ల సాయిలు, దేవదాస్, రైతులు పాల్గొన్నారు.

కోకిల నాగరాజుకు నేషనల్ భారత్ సేవా పురస్కారం

నవతెలంగాణ-ఆర్మూర్

సిరాజ్ డాన్స్, ఆర్ట్స్ అకాడమి, కళాకార్ తెలుగు టీవీ వారి ఆధ్వర్యంలో గురుశిష్య నత్య పరంపర హైదరాబాద్ వేదికగా ఈ ఆదివారం 24న ఘనంగా జరుగబోతుంది . గత మూడు సంవత్సరాలుగా విభిన్న రంగాల్లో విశిష్ట సేవలందించిన వ్యక్తులను రాష్ట్రవ్యాప్తంగా గుర్తించి నేషనల్ భారత్ సేవా అవార్డులు అందజేస్తున్నారు. ఈ సంవత్సరం ప్రముఖ కళాకారుడు ఇందూరు గానకోకిల నాగరాజుకు ఈ అవార్డు ప్రకటించారు. ప్రతి సంవత్సరం వివిధ రంగాల్లో రానిస్తున్న గురువులను, సంఘ సేవకులను, డాక్టర్స్‌ను ఎంచుకొని నేషనల్ భారత్ సేవ అవార్డ్స్‌తో సత్కరించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ వేదాంతం రాదేశ్యం సంగీత నాటక అకాడమి రాష్ట్రపతి అవార్డు, డాక్టర్ అరవింద్ డాక్టర్ స్పందన నాలగండ్ల డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కోమండ్ల శివకుమార్ హాజరవుతున్నారని తెలిపారు. మండలంలోని అంకాపూర్ స్వగ్రామానికి అయినా నాగరాజుకు భారత్ సేవా పురస్కారం పొందడం పట్ల మిత్రబందం శుభాకాంక్షలు తెలిపారు.

అభ్యాస పాఠశాలలో నెట్‌బాల్ క్రీడలు



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ నగరంలోని అభ్యాస పాఠశాల ఆధ్వర్యంలో చెన్న శ్రీనివాస్ మెమోరియల్ సమక్షంలో నెట్‌బాల్ క్రీడలను శుక్రవారం నిర్వహించారు. అందులో జిల్లా వ్యాప్తంగా 16 టీంలు పాల్గొన్నాయి. బాలుర టీంలో మొదటి విజేతగా మిట్టపల్లి టీం, రెండో విజేతగా సుద్దపల్లి టీం, మూడవ విజేతగా అభ్యాస పాఠశాల టీం గెలుపొందాయి. బాలికల్లో మొదటి విజేతగా అభ్యాస పాఠశాల టీం, రెండో విజేతగా తిరుమన్‌పల్లి టీం, మూడో విజేతగా సారంగపూర్ టీంలు గెలుపొందాయి. వారికి అభ్యాస పాఠశాల కరస్పాండెంట్ చెన్న అన్నపూర్ణ అభినందనలు తెలిపి వారికి ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో అభ్యాస పాఠశాల ప్రిన్సిపల్ మాధవి, జిల్లా ఎస్జిఎఫ్ ప్రెసిడెంట్ ఏఎస్ ధర్మేందర్, నెట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్, అభ్యాస స్కూల్ పిఈటి ఏ.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

- ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సునీల్ కుమార్ శుక్రవారం పరామర్శించారు. కోనసముందర్ గ్రామానికి చెందిన భూమేశ్వర్ కువైట్‌లో చనిపోవడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి, రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. బషీరాబాద్ గ్రామానికి చెందిన మారంపల్లి ఆశన్న పెరాలసిస్ వ్యాధితో బాధపడుతుండడంతో పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన రాకేష్ గౌడ్ వాళ్ల నాన్న లింగ గౌడ్‌కు గుండె ఆపరేషన్ జరిగి రెండు స్టంట్లు పడడంతో పరామర్శించారు. హాసకొత్తూరు గ్రామానికి చెందిన బద్దం రవి వాళ్ళ నాన్నమ్మ బద్దం లింగు మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన ఏనుగు మోహన్, ఏనుగు రాజేశ్వర్ వాళ్ళ నాన్న ఏనుగు రాములు చనిపోవడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఉప్లూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి ఆవారి రమేష్ కుమారుడు శ్రీ భువన్ ఇటీవల మరణించగా కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని ప్రకటించారు. ఆయన వెంట కమ్మర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నరసయ్య, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గుమ్మిర్యాల్ లో మేకల సంత ప్రారంభం

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మేకల సంత ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ..ఇట్టి మేకల సంత ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బందిని నియమించాలి

- సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బందిని నియమించి సమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి పల్లాపు వెంకటేష్ అన్నారు. ఏరియా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవికుమార్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈసందర్భంగా పల్లపు వెంకటేష్, కుతా డి ఎల్లయ్యలు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రి వంద పడకల ఆసుపత్రి అని ప్రభుత్వం 2021లో ప్రారంభించిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉండాల్సిన స్టాఫ్ 19 మందికి గాను కేవలం ఇద్దరు మాత్రమే పర్మినెంట్ డాక్టర్లు ఉన్నారని అన్నారు. ఏడుగురు డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారని తెలిపారు. ఆసుపత్రిలో బెడ్స్ 75 మాత్రమే ఉన్నాయని వంద పడకలకు సరిపోయే స్టాఫ్ గాని, బెడ్స్ గాని లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. మూడు సంవత్సరాలు దాటిపోయిన నేటికీ స్టాఫ్‌ను భర్తీ చేయలేదని తలెఇపారు. రాష్ట్ర ప్రభుత్వం 100 పడకలకు సంబంధించిన స్టాఫ్‌ను రిక్రూట్ చేయాలని డిమాండ్ చేశారు. మత్తు డాక్టరు సైతం డిప్యుటేషన్‌పై కొనసాగుతున్నాడని అన్నారు. ప్రభుత్వం మాత్రం ప్రైవేట్ హాస్పిటళ్లను ప్రోత్సహించి లైసెన్సులిచ్చి పెద్ద పెద్ద కార్పొరేట్ హాస్పిటళ్లకు అనుమతులు ఇచ్చి ప్రజలను దోచుకునే విధంగా అవకాశాలు కల్పిస్తుందని అన్నారు. ఆర్ఎంపి, పిఎంపి డాక్టర్ నుండి ప్రైవేట్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న ప్రతి డాక్టర్ కనీసం ప్రభుత్వ హాస్పిటల్లో ఒక గంట పని చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రోజు ఓపి 450 మందిని చూస్తున్నారని, ఇక్కడ ఎక్స్‌రే సౌకర్యం, స్కానింగ్ సౌకర్యం లేదని తెలిపారు. వీటన్నింటికోసం ప్రయివేటుకు వెళ్లే పరిస్థితి ఉందన్నారు. హాస్పిటల్‌కి వచ్చే ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. రోజుకు 8 డెలివరీలు చేస్తున్నారని వారికి కావలసిన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ కమిటీ సభ్యులు పి భూమన్న, రవి, కుల్దీప్ శర్మ ఓంకార్, చింటూ, రవి బాబు, రఫిక్, యాట కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం జీవన భృతిని అమలు చేయాలి

నవతెలంగాణ-బోధన్

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలలో భాగంగా 6 గ్యారంటీలలో వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి రూ.12000 వేల జీవన భృతి అమలు చేయాలని ఏఐఏకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ రామకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన వ్యవసాయ కూలీల సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మికులకు 100 రోజుల్లో జీవనభృతి అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. వ్యవసాయ కూలీలకు జీవన భృతికై డిసెంబర్ 2న చలో కలెక్టర్ ముట్టడి విజయవంతం చేయాలని కోరారు. ఈ సదస్సులో రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.గంగాధర్, జిల్లా కార్యదర్శి జి.కిషన్, మాస్‌లైన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేష్, నసీర్, ఎం.సాయరెడ్డి, గుమ్ముల గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షులు పుట్టి నాగన్న, వంజరి గంగాధర్, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

చలో పార్లమెంట్ పోస్టర్ల ఆవిష్కరణ



ఆర్మూర్ : చలో పార్లమెంట్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్/బోధన్

అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని సివిఆర్ జూనియర్ కళాశాల వద్ద శుక్రవారం చలో పార్లమెంట్ కరపత్రాల ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి గోపాల్ సింగ్ ఠాగూర్ మాట్లాడుతూ... ఈనెల 28న విద్య, ఉపాధి, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ పరం చేయడం, ప్రజా వ్యతిరేక విధానాన్ని మానుకోవాలని అన్నారు. ప్రభుత్వ విద్య రంగాన్ని కాపాడుకోవాలంటే కొఠారి కమిషన్ ప్రకారం మొత్తం కేంద్ర బడ్జెట్లో విద్య రంగానికి 10శాతం నిధులు కేటాయించాలని, కానీ ప్రతి ఏటా 2-3శాతం కంటే ఎక్కువ కేటాయించడం లేదని అన్నారు. కార్పొరేట్ వ్యక్తులకు విద్యారంగాన్ని ధారాదత్తం చేసేందుకే ఈ నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. విద్యార్థులు, మేధావుల అభిప్రాయం తీసుకోకుండా నేరుగా ఎన్ఈపీ అమలు చేయడం దారుణమని అన్నారు. వెంటనే నూతన జాతీయ విద్యా విధానం 2020ను రద్దు చేయాలని, చరిత్రను వక్రీకరిస్తూ చేస్తున్న ఎన్సీఈఆర్ సిలబస్ మార్పులను ఆపాలన్నారు. యూనివర్సిటీ గ్రాండ్ కమిషన్ నిధులను తగ్గించి నిర్వీర్యం చేసే కుట్రను మానుకోవాలని, యూనివర్సిటీలో స్వయం ప్రతిపత్తిని కాపాడాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ పరిశోధక విద్యార్థుల ఫెలోషిప్‌లో కోతలు విరమించుకోవాలని అన్నారు. ఆదేవిధంగా విద్యా కాషాయీకరణ కుట్రను మానుకోవాలని, శాస్త్రీయ విద్యా విధానాన్ని బలపరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థి, యువజన, మహిళ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన ఛలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, నాయకులు దినేష్, సిద్ధు, గణేష్, శివ, నిఖిల్, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్:పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద అఖిల భారత విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో చలో పార్లమెంట్ కార్యక్రమ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సాయికుమార్ మాట్లాడుతూ.. విద్యా, ఉపాధి, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ పరం చేయడాన్ని నిరసిస్తూ, అదేవిధంగా ప్రజా వ్యతిరేక విధానాన్ని మానుకోవాలని కోరుతూ ఈ నెల 28న చలో పార్లమెంటు కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బోధన్ డివిజన్ అధ్యక్షుడు శివాజీ, నాయకులు కృష్ణ, నాగేష్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

పట్టణ కేంద్రంలోని దేవి హాస్పిటల్ యజమాన్యం మండల పరిధిలోని జంగమయ్యపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించినట్టు ఆస్పత్రి ఎం.డి మహిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంగమయ్యపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో డాక్టర్ యశ్వంత్ రామచంద్ర ఎంబీబీఎస్ ప్రత్యేక శ్రద్ధతో వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులను పరీక్షించారు. అనంతరం వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశామని తెలిపారు. ఉచిత సేవలందిస్తున్న దేవి ఆస్పత్రి యజమాన్యానికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి వైఎంసి చైర్మన్ రజిత, మాజీ సర్పంచ్ వెంకట్రాంరెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి, ఆస్పత్రి సిబ్బంది, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

మండలం లోని కొమన్ పల్లి గ్రామానికి చెందిన ముత్తెన్న ఇటీవలే అనారోగ్యంతో బాధపడు తుండటంతో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి శుక్రవారం ముఖ్యమంత్రి సహాయ నిధి, 95వేల ఎల్ఓసీని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. వినయ్ రెడ్డికి వారి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

సర్వే వివరాల నమోదులో తప్పిదాలు చేయొద్దు

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-ఆర్మూర్

ఆన్లైన్ లో సర్వే వివరాల నమోదులో తప్పిదాలు చేయొద్దు అని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల స్థితిగతులను విశ్లేషించేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటి సమగ్ర సర్వే సందర్భంగా సేకరించిన వివరాలను ఆన్లైన్‌లో నిక్షిప్తం చేసే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నందిపేట మండల పరిషత్ కార్యాలయాన్ని కలెక్టర్ శుక్రవారం సందర్శించి, ఇంటింటి సర్వే ద్వారా సేకరించిన వివరాలను ఆపరేటర్లు ఆన్లైన్లో నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. ఒక్కో దరఖాస్తు వివరాలను ఆన్లైన్లో నిక్షిప్తం చేసేందుకు ఎంత సమయం పడుతోందని కలెక్టర్ ప్రశ్నించగా, సుమారు 15 నిమిషాల వ్యవధి అవుతోందని ఆపరేటర్లు తెలిపారు. ఎన్యూమరేటర్, సూపర్వైజర్ల లింక్‌ను జతపరుస్తూ, వివరాలను ఆన్లైన్లో నమోదు చేస్తున్నామని అన్నారు. నిబంధనలను పక్కాగా పాటిస్తూ, అన్ని వివరాలను ఆన్లైన్లో జాగ్రత్తగా నమోదు చేయాలని కలెక్టర్ హితవు పలికారు. త్వరితగతిన ఆన్లైన్ నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని, శిక్షణ సందర్భంగా సూచించిన అంశాలను తు.చ తప్పకుండా పాటించాలన్నారు. ఎలాంటి పొరపాట్లు, తప్పిదాలకు ఆస్కారం లేకుండా చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆన్లైన్లో వివరాలు నమోదు సందర్భంగా క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురైనా, సాంకేతికపరమైన సమస్యలు ఏవైనా ఉత్పన్నం అయితే, వెంటనే అధికారుల దృష్టికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు